సాక్షి
అన్నమయ్య జిల్లా
శనివారం । 15 । ఫిబ్రవరి । 2025



పంట పొలాలపై ఏనుగుల దాడి

పుల్లంపేట మండలం అనంతసముద్రం పంచాయతీలోని దానరిపల్లి గ్రామ సమీపంలోని పంటపొలాలపై ఏనుగులు దాడి చేశాయి. అరటిచెట్లను తొక్కి నాశనం చేశాయి. -8లో



గంగమ్మా.. చల్లంగా చూడమ్మా

గంగమ్మా ...చల్లంగా చూడమ్మా అంటూ భక్తులు అమ్మవారిని వేడుకున్నారు. మదనపల్లె మండలం సీటీఎంలో వెలసిన శ్రీ నలవీరగంగాభవానీ జాతర ఘనంగా జరిగింది. -8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.130	రూ.160
రెండోరకం	రూ.90	రూ.120

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 46 మెట్రిక్ టన్నులు



న్యూస్‌రీల్

ఐదుగురు డీటీల బదిలీ

రాయచోటి: జిల్లాలో ఐదుగురు డిప్యూటీ తహసీల్దార్ల(డీటీ)ను బదిలీ చేస్తూ జిల్లా కలెక్టర్ ఛామకూరి శ్రీధర్ ఉత్తర్వులు ఇచ్చారు. శుక్రవారం కలెక్టర్ కార్యాలయం నుంచి విడుదలైన ఉత్తర్వుల్లో బదిలీ అధికారుల పేర్లను పేర్కొన్నారు. పీలేరు డిప్యూటీ తహసీల్దార్‌గా పనిచేస్తున్న జి రెడ్డప్ప రెడ్డిని జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ప్రొటోకాల్ సెక్షన్ ఇన్‌చార్జి సూపరింటెండెంట్‌గా, మదనపల్లె డీటీగా పనిచేస్తున్న జి అస్లాంను టి సుండుపల్లి డీటీగా, నిమ్మనపల్లి డీటీగా పనిచేస్తున్న ఆర్ఎం బాబ్జీ మదనపల్లి డీటీగా, సుంపపల్లి డీటీగా పనిచేస్తున్న బి రెడ్డన్న లక్కిరెడ్డిపల్లి టీడీగా, పెనగలూరు డీటీగా పనిచేస్తున్న ఎం జ్యోతి నందలూరు డీటీగా బదిలీ చేస్తున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

మార్చి 8న లోక్ అదాలత్



మాట్లాడుతున్న జడ్జి ఎం.ఎస్. భారతి

పీలేరురూరల్: జాతీయ లోక్ అదాలత్ మార్చి 8న జరుగనుంది. దీనిని విజయవంతం చేయాలని చిత్తూరు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఎం.ఎస్. భారతి అన్నారు. శుక్రవారం స్థానిక ఏడీజే కోర్టులో న్యాయవాదులు, పోలీసులు, అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ కక్షిదారులు ఇరు వర్గాలను ఒప్పించి ఎక్కువ కేసులు పరిష్కారమయ్యేలా కృషి చేయాలన్నారు. అనంతరం స్థానిక గిరిజన గురుకుల బాలుర పాఠశాలను సందర్శించి విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలని ఆదేశించారు.స్థానిక సబ్‌జైల్‌ను సందర్శించి ఖైదీలకు ఉన్న సౌకర్యాల గురించి ఆరా తీశారు.11వ అదనపు జడ్జి ఎ. మహేష్, సీనియర్ సివిల్ కె. రవి, ఏపీపీ శారద, బార్ అసోసియేషన్ అధ్యక్షులు పురుషోత్తం రెడ్డి, సెక్రటరీ చంద్రశేఖర్, సీఐ యుగంధర్ తదితరులు పాల్గొన్నారు.


మార్చిలోపు వంద రోజుల పనులు పూర్తి చేసుకోవాలి



ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న డ్వామా పీడీ ఆదిశేషారెడ్డి

సిద్దవటం: ఉపాధి హామీ పథకం కూలీలు మార్చి లోపు వంద రోజుల కూలి పనులను పూర్తి చేసుకోవాలని డ్వామా పీడీ ఆదిశేషారెడ్డి తెలిపారు. సిద్దవటం మండలం లోని సంటిగారిపల్లె , మాచుపల్లె గ్రామాల్లో డ్వామా పీడీ శుక్రవారం రెండు మినీ గోకులాలను, మూలపల్లె, టక్కోలు గ్రామాల్లో ఉపాధి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులు పూర్తి చేసుకున్న గోకులాల షెడ్లకు నిధులు మంజూరు చేయాలని కోరగా త్వరలో ప్రభుత్వం నుంచి ఖాతాల్లోకి నిధులు జమ అవుతాయని తెలిపారు. టక్కోలులో ఉపాధి పనులు చేస్తున్న పని ప్రదేశానికి వెళ్లి కూలీలతో సమావేశం నిర్వహించారు. వారితో మాట్లాడారు. పనిముట్లు, గడార్‌లు మొద్దుబారాయని కొత్తవి ఇవ్వాలని, పని ప్రదేశంలో వృద్ధులు, మహిళలకు షెడ్ల సదుపాయం కల్పించాలని కూలీలు కోరగా ప్రభుత్వానికి నివేదిస్తామని పీడీ వారికి తెలియజేశారు. ఏపీడీ సోమశేఖర్‌రెడ్డి, ఏపీఓ నరసింహులు పాల్గొన్నారు.

ఫైలేరియా వ్యాప్తి చెందకుండా అవగాహన



వ్యాధిగ్రస్తుని కాళ్లను నీటితో శుభ్రం చేస్తున్న ఏఎన్ఎం

సిద్దవటం: ఫైలేరియా(బోద కాలు) వ్యాధి వ్యాప్తి చెందకుండా రోగులకు అవగాహన కల్పిస్తున్నామని జిల్లా మలేరియా అధికారిణి మనోరమ తెలిపారు. సిద్దవటం మండలం లోని మాధవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ సుబ్బారాయుడు ఆధ్వర్యంలో ఒంటిమిట్ట, మాధవరం, అట్లూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను తనిఖీ చేసినట్లు చెప్పారు. సిద్దవటం సబ్ యూనిట్ పరిధిలో 38 మందికి ఈ వ్యాధి సోకగా అందులో ఒంటిమిట్టలో 25 మందికి, మాధవరం-1లో 8మందికి , అట్లూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో ముగ్గురు ఫైలేరియా వ్యాధితో బాధపడుతున్నారన్నారు. వ్యాధితో బాధ పడుతున్న 38 మందికి ఫైలేరియా ఎంఎండీ కిట్స్‌ను పంపిణీ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో మలేరియా సబ్‌యూనిట్ అధికారి సుబ్బరాయుడు, మాధవరం, ఒంటిమిట్ట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు డాక్టర్ శివకుమార్, డాక్టర్ హేమలత తదితరులు పాల్గొన్నారు.

కర్కశం



- పెళ్లి కావాల్సిన యువతిపై అమానుషం
- టీడీపీ నేత కుమారుడి చర్యతో కలకలం
- అధికారబలం అండగా చెలరేగుతున్న యువత
- అబలలపై సాగుతున్న దురాగతాలు
- ఘటనపై వెల్లువెత్తుతున్న ప్రజాగ్రహం



నిందితుడు గణేష్ (ఫైల్)

సాక్షి రాయచోటి: మానవత్వం మంటగలుస్తోంది. సభ్య సమాజంలో తలె త్తుకుని బతకాల్సిన ఆడపిల్లలపై అధికారం అండగా... చెలరేగుతున్న కూటమి నేతల కర్కశాలపై ప్రజాగ్రహం వెల్లువెత్తుతోంది. అతి త్వరలో పెళ్లిపీటలు ఎక్కాల్సిన యువతిపై ఉన్మాద చర్యలకు ఉపక్రమించడం ఆందోళన కలిగించే పరిణామం . అబలలపై అఘాయిత్యాలు..అంతేకాకుండా వికృత చేష్టలతో మహిళా లోకం తల్లడిల్లిపోతోంది. ఇటీవలే ఓ తండ్రి ఇద్దరు ఆడబిడ్డలను లైంగిక వేధింపులకు గురి చేయగా..వ్యక్తిగత కారణాలతో మహిళా హత్యలు కూడా పెరిగిపోయాయి. అయితే గుర్రంకొండలో శుక్రవారం ఓ యువతిపై మదనపల్లెకు చెందిన గణేష్ అనే యవకుడు కత్తితో దాడి చేసి...యాసిడ్ పోసిన సంఘటన క్రూర ప్రవర్తనకు నిదర్శనంగా నిలుస్తోంది. ప్రేమికుల రోజు జరిగిన ఈ ఘటన ఒక్కసారిగా జిల్లాలో కలకలం రేపింది.



బాధితురాలు గౌతమిని జిల్లా ఆస్పత్రికి తీసుకువస్తున్న కుటుంబ సభ్యులు

మహిళల భద్రతపై భయం...భయం...

అన్నమయ్య జిల్లాలో మహిళల భద్రతపై భయం భయం నెలకొంది. జిల్లాలో ఏదో ఒకచోట హత్యలు, అత్యాచారాలు, దాడులు చోటుచేసుకుంటుండడం ఆందోళన కలిగించే పరిణామం. పోలీసులు మహిళల రక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటే తప్ప ఇలాంటి ఘటనలు అరికట్టడం కష్టంగా మారుతుంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మదనపల్లెలో ఓ సీఐ తల్లిని అంతమొందించిన ఘటన మొదలుకొని.. ఒక లెక్చరర్ అయిన ముస్లిం మైనార్టీ మహిళను మట్టుబెట్టించారు. ఇదేకాదు...ఇటీవలికాలంలో మహిళలకు సంబంధించిన హత్యా ఘటనలు కూడా చోటుచేసుకుంటున్నాయి. గుర్రంకొండలో యువతిపై యాసిడ్ ఘటనతో ఒక్కసారిగా మహిళల భద్రతపై భయం అలుముకుంది.

ఆది నుంచి వైఎస్సార్ సీపీ ఆందోళన: రాష్ట్ర వ్యాప్తంగా మహిళలకు సంబంధించి రక్షణ కరువైందని...అంతేకాకుండా జిల్లాలో కూడా మహిళల పరంగా ఎదురవుతున్న సమస్యలపై వైఎస్సార్ సీపీ ఆది నుంచి ఆందోళన వ్యక్తం చేస్తూనే ఉంది. యువతిపై కత్తితో దాడితోపాటు కర్కశంగా మదనపల్లె టీడీపీ నేత కుమారుడు గణేష్ కర్కశంగా యాసిడ్ పోసి అంతమొందించే ప్రక్రియ చూస్తే భయాందోళనలు వ్యక్తమవుతున్నాయి. అధికారం ఉంది కదా తమను ఎవర ఏమి చేయలేరన్న ధీమాతో ఇలాంటి చర్యలకు పూనుకోవడంపై ప్రజాస్వామ్యంలో పెద్ద ఎత్తున నిరసన వ్యక్తమవుతోంది. ఈ ఘటనపై వైఎస్సార్ సీపీ అధ్యక్షులు, మాజీ సీఎం వైఎస్ జగన్ కూడా స్పందించి బాధితురాలికి అత్యున్నత వైద్యం అందించడంతోపాటు కుటుంబానికి న్యాయం చేసి ఆడబిడ్డల రక్షణకు చర్యలు తీసుకోవాలని పోలీసులను కోరారు.

జనాగ్రహం



గౌతమి (ఫైల్)

పీలేరు నియోజకవర్గం లోని గుర్రంకొండలో వివాహం కావాల్సిన యువతిపై మదనపల్లెకు చెందిన టీడీపీ నేత కుమారుడు దాష్టీకానికి పాల్పడటంపై సర్వత్రా జనాగ్రహం వ్యక్తమవుతోంది. ఎక్కువగా మదనపల్లె అడ్డాగా పలు అసాంఘిక కార్యకలాపాలు చోటుచేసుకుంటున్న నేపథ్యంలో పోలీసులు ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. యువతిపై దాడి ఘటనపై ప్రతి ఒక్కరూ తీవ్రంగా ఖండిస్తున్నారు. జిల్లాలో భవిష్యత్తులో ఇలాంటి ఘటనలకు ఆస్కారం లేకుండా పోలీసులు తీవ్రమైన చర్యలు తీసుకోవాల్సి ఉందని ప్రజానీకం కోరుతోంది.



గౌతమిపై దాడిచేయడానికి నిందితుడు తీసుకొచ్చిన యాసిడ్ బాటిల్

ప్రేమ పేరుతో దాడులు చేయడం ఆటవికం

మదనపల్లె: ప్రేమ పేరుతో దాడులు చెయ్యడం ఆటవికమని సీపీఎం జిల్లా కార్యదర్శి పి.శ్రీనివాసులు అన్నారు. యాసిడ్ దాడికి పాల్పడిన గణేష్‌ను కఠినంగా శిక్షించాలని శుక్రవారం ప్రజా సంఘాలు జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో నిరసన ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి పి.శ్రీనివాసులు మాట్లాడుతూ గుర్రంకొండ మండలం, ప్యారంపల్లి యువతిపై ప్రేమోన్మాది దాడిని ఖండిస్తూ, సైకో గణేష్ పై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. డిగ్రీ చదువుకుని స్వయం ఉపాధి పొందుతున్న యువతి ప్రేమించలేదనే ఉన్మాదంతో ప్రేమికుల దినోత్సవం రోజున కత్తితో పొడిచి, యాసిడ్ పోసి దాడి చేయడం ప్రతి ఒక్కరూ తలదించుకునే దుర్ఘటన అన్నారు. బాధిత యువతి కుటుంబానికి 25 లక్షల పరిహారం చెల్లించాలని, బాధితురాలికి ప్రభుత్వం ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) జిల్లా కన్వీనర్ యం.భాగ్యమ్మ మాట్లాడుతూ మహిళలు, చిన్న పిల్లలపై దాడులు, అత్యాచారాలు నిత్యకృత్యం అయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. మహిళలపై దాడులు అరికట్టడంలో ప్రభుత్వాలు విఫలమవుతున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు.



జిల్లా ఆస్పత్రిలో యాసిడ్ ఘటన నిందితుడిపై కఠిన చర్యలు కోరుతూ సీపీఎం ఆధ్వర్యంలో ధర్నా

కూటమి ప్రభుత్వంలో మహిళలపై పెరుగుతున్న దాడులు

- వైఎస్సార్ సీపీ సమన్వయకర్త నిసార్‌అహ్మద్



మాట్లాడుతున్న నిసార్‌అహ్మద్

మదనపల్లె: కూటమిప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రాష్ట్రంలో మహిళలు, చిన్నారులపై దాడులు, అఘాయిత్యాలు అధికమయ్యాయని నియోజకవర్గ వైఎస్సార్ సీపీ సమన్వయకర్త నిసార్‌అహ్మద్ అన్నారు. శుక్రవారం వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ... పీలేరు నియోజకవర్గం నడిమికండ్రిగ పంచాయతీ ప్యారంపల్లెలో గౌతమిపై జరిగిన యాసిడ్‌దాడిని ఖండించారు. మదనపల్లెకు చెందిన టీడీపీ నాయకుడు సంకారపు మురళీ కుమారుడు గణేష్, పెళ్లిపీటలు ఎక్కాల్సిన ఆడబిడ్డ జీవితాన్ని నాశనం చేశాడన్నారు. ఇలాంటి ఘటనలు ఎవరు చేసినా నిందితులను కఠినంగా శిక్షించాలన్నారు. నిందితుడు టీడీపీ నాయకుడు కావడంతో బాధితురాలిని రాజీ కోసం ప్రయత్నిస్తున్నట్లు తెలిసిందని, కూటమిప్రభుత్వంలో ఆడబిడ్డకు చేసే న్యాయం ఇదేనా అంటూ సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌ను ప్రశ్నిస్తున్నామన్నారు. మహిళలు, బాలికలపై అత్యాచారాలు, దాడులు, హత్యలు అరికట్టడంలో కూటమిప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో మహిళల రక్షణ కోసం జగన్‌మోహన్‌రెడ్డి దిశ వ్యవస్థను తీసుకువచ్చారన్నారు. ఘటన జరిగిన వెంటనే పోలీసులు స్పందించి రక్షణ కల్పించేలా ఏర్పాట్లు చేశారన్నారు. యాసిడ్ ఘటనలో ప్రేమోన్మాది దాడిలో బాధిత యువతికి ప్రభుత్వం మెరుగైన వైద్యం అందించాలని, కుటుంబానికి అండగా నిలిచి, నిందితుడిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. సమావేశంలో వైఎస్సార్ సీపీ నాయకులు ఎస్.ఏ.కరీముల్లా, కౌన్సిలర్ ఈశ్వర్‌నాయక్, కొత్తపల్లె మహేష్, యూనస్ పాల్గొన్నారు.

ఆత్మీయం.. అనురాగం



ఆశీర్వచనాలు.. శుభాకాంక్షలు

మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పర్యటన ఆత్మీయత, అనురాగం మధ్య సంబురంగా సాగింది. వైఎస్సార్‌సీపీ అధినేత శుక్రవారం కడపకు వచ్చారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎంవీ రామచంద్రారెడ్డి కుమారుడు ఎంవీ సుధీర్‌కుమార్‌రెడ్డి, లక్ష్మీమౌనిక వివాహ మహోత్సవానికి ఆయన హాజరయ్యారు. నూతన వధూవరులను ఆశీర్వదించి, శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వైఎస్ జగన్‌ను చూసేందుకు జనం పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. తమ నేతతో కరచాలనం చేసేందుకు అభిమానులు, పార్టీ శ్రేణులు పోటీ పడ్డారు. ఆయన చిరునవ్వుతో పలుకరించి, వారిలో ఉత్సాహాన్ని నింపారు. – కడప కార్పొరేషన్



జననేత అభివాదం



నూతన వధూవరులతో ఉమ్మడి వైఎస్సార్ జిల్లా వైఎస్సార్‌సీపీ నేతలు

ఢిల్లీ రైలు హాల్టింగ్‌కు గ్రీన్‌సిగ్నల్!



జిల్లా మీదుగా నడిచే ఢిల్లీ రైలు



రైల్వేమంత్రికి ఢిల్లీ రైలు హాల్టింగ్ చేయాలని వివరిస్తున్న రాజంపేట ఎంపీ పీవీమిథున్‌రెడ్డి

- రైల్వేబోర్డు నుంచి వెలువడిన ఉత్తర్వులు
- 17 ఏళ్ల తర్వాత ఏపీ సంపర్క్ క్రాంతికి హాల్టింగ్

రాజంపేట: అధ్యాత్మికనగరం తిరుపతి నుంచి దేశరాజధానికి రాజంపేట, నందలూరు,కడప మీదుగా నడిచే ఢిల్లీ రైలుకు(12708/12707) పార్లమెంటరీ నియోజకవర్గకేంద్రమైన రాజంపేటలో హాల్టింగ్‌కు రైల్వేబోర్డు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఈమేరకు గురువారం ఉత్తర్వులను జారీ చేసింది. త్వరలో హాల్టింగ్ తేదీని ఖరారు చేసేందుకు రైల్వేబోర్డు యోచిస్తోంది. అయితే ఈ హాల్టింగ్ ప్రయోగత్మాకంగానే ఇవ్వనున్నారు. హాల్టింగ్ అనంతరం ఎర్నింగ్స్‌ను బేస్ చేసుకోనున్నారు. ఎర్నింగ్స్‌పై నివేదికను జోనల్‌కు వెళ్లిన తర్వాత హాల్టింగ్‌ను కొనసాగించడమా, ఎత్తివేయడమా అనేది ఆలోచన చేయనున్నారు.

- ఢిల్లీ రైలు హాల్టింగ్ ఇవ్వడానికి 17 యేళ్లు పట్టింది. రాజంపేట ఎంపీ పీవీ మిథున్‌రెడ్డి ఎంపీ అయిన తొలినాటి నుంచి రాజంపేటలో ఏపీ సంపర్క్ క్రాంతి ఎక్స్‌ప్రెస్ రైలుకు హాల్టింగ్ ఇవ్వాలని కోరుతూ వచ్చారు. రైల్వేమంత్రి అశ్విని వైష్ణవ్‌కుమార్, రైల్వేబోర్డు చైర్మన్‌ను అనేకమార్లు కలిసి ఈ అంశంపై మాట్లాడారు. ఇటీవల రాజ్యసభ సభ్యుడు మేడా రఘునాథరెడ్డి కూడా ఏపీసంపర్క్ క్రాంతి ఎక్స్‌ప్రెస్‌రైలు హాల్టింగ్ ఇవ్వాలని రైల్వేశాఖను కోరారు.
- అప్పటి యూపీఏ సర్కార్ రైల్వేమంత్రి లాలు ప్రసాద్‌యాదవ్ సంపర్క్ క్రాంతిరైళ్లను తీసుకొచ్చారు. 2005 మార్చి రైల్వేబడ్జెట్‌లో ప్రకటించారు. అదే సమయంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాజధాని నగరమైన సికింద్రాబాద్ జోనల్ ప్రధానకార్యాలయం, సికింద్రాబాద్ జంక్షన్ ఢిల్లీ నిజాముద్దీన్‌కు ఏపీ సంపర్క్ క్రాంతి ఎక్స్‌ప్రెస్‌రైలును జూలై 2005లో పట్టాలెక్కించారు.



దివంగత సీఎం వైఎస్సార్ చొరవతో..




దివంగత సీఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి దృష్టి ఏపీసంపర్క్ క్రాంతి ఎక్స్‌ప్రెస్ రైలుపై పడింది. ఈ రైలును ఆధ్యాతికనగరం తిరుపతి నుంచి కడప, రాజంపేట పార్లమెంటరీ కేంద్రాలైన రాజంపేట, కడప మీదుగా సికింద్రాబాద్ వరకు నడిపించాలని రైల్వేమంత్రిత్వశాఖను కోరారు. 2007లో ఈ రైలు సికింద్రాబాదు టు ఢిల్లీకి నడిచింది.దీనిని తిరుపతి నుంచి రేణిగుంట, రాజంపేట, నందలూరు, కడప ,గుత్తి, డోన్, కర్నూలు, మహబూబ్‌నగర్ మీదుగా పొడిగించారు.

- సీమ ప్రాంత ప్రజలకు ముఖ్యంగా ఉమ్మడి కడప జిల్లా వాసులకు దేశరాజధాని ఢిల్లీకి వెళ్లడానికి ఒక్క రైలు కూడా లేదు. వీరు ఢిల్లీ, ఉత్తరాదినగరాలకు వెళ్లాలంటే రేణిగుంటకు వచ్చి, అక్కడి నుంచి కేరళ ఎక్స్‌ప్రెస్ ద్వారా వయా నెల్లూరు, గూడూరు మీదుగా ప్రయాణించాల్సిన పరిస్థితులు ఉండేవి. దివంగత సీఎం వైఎస్సార్ చొరవ వల్ల ఇప్పుడు నేరుగా జిల్లా మీదుగా దేశరాజధానికి వెళ్లేందుకు రైలు అందుబాటులోవచ్చింది.
- ఏపీ సంపర్క్ క్రాంతి ఎక్స్‌ప్రెస్‌రైలును డైలీ నడపాలని ప్రయాణికులు కోరుతున్నారు. సీమ ప్రాంత ప్రజలకు, ఉత్తర తెలంగాణా నగరాలకు, హైదరాబాద్‌కు వెళ్లడానికి పగటిపూట జర్నీ అందుబాటులో ఉంటుంది. డైలీ నడిస్తే కడప, రైల్వేకోడూరు, రాజంపేట, నందలూరు, ఎర్రగుంట్ల, తాడిపత్రి, గుత్తి, కర్నూలు నుంచి ఖాజీపేట, పెద్దపల్లి, మంచిర్యాల, సిర్పూర్, కాగజ్‌నగర్ వెళ్లడానికి ఉపయోగపడుతుంది.
- కేరళ, హిమసాగర్, నవయుగ,స్వర్ణ జయంతి నడుస్తున్నాయి. ఇవన్నీ తిరువంతనంతపుర, ఎర్నాకులం, కన్యాకుమారి నుంచి వస్తున్నాయి. వీటిలో రిజర్వేషన్ దొరకడం చాలకష్టం. మూడునెలల ముందు కూడా దొరకవు. ఇవన్నీ గూడూరు-విజయవాడ-వరంగల్-పెద్దపల్లి మీదుగా వెళ్తాయి. ఇటువంటి పరిస్థితిలో ఏపీ సంపర్క్ క్రాంతి ఎక్స్‌ప్రెస్ రైలు డైలీ నడిపిస్తే ఉపయోగకరంగా ఉంటుందని కడప,అనంతపురం,కర్నూలు వాసుల నుంచి డిమాండ్ వినిపిస్తోంది.

ప్రభుత్వ తీరు.. టీచర్ల బెంబేలు


- నేడు జిల్లాలో 125 క్లస్టర్ స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలు
- ఒక పూట బడి, ఇంకో పూట మీటింగులు
- కూటమి సర్కారు వింత నిర్ణయంపై సర్వత్రా విమర్శలు



మదనపల్లె సిటీ: కూటమి ప్రభుత్వం తీసుకుంటున్న అనాలోచిత నిర్ణయాలతో విద్యావ్యవస్థ అధోగతి పాలవుతోందని ఉపాధ్యాయులు, సంఘాల నాయకులు అగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల కొత్తగా క్లస్టర్ స్కూల్ కాంప్లెక్స్‌లు ఏర్పాటైన తర్వాత సమావేశాల నిర్వహణకు మూడో శనివారం ఈ సమావేశాలు నిర్వహించనున్నారు. ఒక వేళ ఆ రోజు సెలవు దినమైతే నాల్గో శనివారం నిర్వహిస్తారు.

భిన్నమంటూనే చిక్కుల్లోకి నెట్టి..

సమావేశాల నిర్వహణపై ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలతో అటు విద్యార్థులు, ఇటు టీచర్లకు కొత్త చిక్కులు వచ్చి పడ్డాయనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ప్రతి అంశంలోనూ గతానికి భిన్నమంటూ అసంబద్ధ నిర్ణయాలు తీసుకుంటున్నారనే ఆవేదన వ్యక్తమవుతోంది. గతంలో రెండు రోజులు కాంప్లెక్స్ సమావేశాలు జరిగేవి. తొలి రోజు 50 శాతం మంది, తర్వాత రోజు 50 శాతం మంది టీచర్లు హాజరయ్యేవారు. దీంతో ఇబ్బందులుండేవి కాదు. జిల్లాలో కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత 125 క్లస్టర్ స్కూల్ కాంప్లెక్స్‌లుగా మార్పు చేశారు. ఒక్కో స్కూల్ కాంప్లెక్స్‌లో 10 నుంచి 20 స్కూళ్లు ఉంటాయి. ఈనెల 15న తొలి క్లస్టర్ స్కూల్ సమావేశాలు జరగనున్నాయి.




మదనపల్లె జెడ్పీ ఉన్నత పాఠశాల

ఉదయం బడి, మధ్యాహ్నం మీటింగ్..


ఉదయం నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు స్కూళ్లు పెట్టుకోవాలి. ఆ తర్వాత ఒంటి గంట నుంచి సాయంత్రం 5 గంటల వరకు కాంప్లెక్స్ సమావేశాల్లో పాల్గొనాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. దీంతో ఉదయం పాఠశాలకు వెళ్లి తిరిగి మధ్యాహ్నం స్కూల్ కాంప్లెక్స్ మీటింగ్‌కు వెళ్లాలంటే పలువురి ఉపాధ్యాయులకు ఇబ్బందులు పడే అవకాశాలున్నాయి.

రెండు చేయాలంటే కష్టం



ఉదయం బడికి వెళ్లి తర్వాత మీటింగ్‌కు వెళ్లాలంటే ఉపాధ్యాయులకు కష్టం. మధ్యాహ్నం 12 గంటల వరకు స్కూళ్లల్లో ఉండి తర్వాత 20 నుంచి 30 కిలోమీటర్ల దూరంలో ఉన్న క్లస్టర్ స్కూల్‌కు ఎలా చేరుకుంటారో ప్రభుత్వానికే తెలియాలి.సమావేశాలు సౌకర్యవంతంగా ఉండేలా నిర్వహించాలి. –మధుసూదన్, ఎస్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి

విద్యార్థులకు ఇబ్బందులు



ఉదయం పాఠశాల పెట్టుకుని భోజనం పెట్టిన తరువాత పాఠశాల వదలిపెట్టడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతారు. వారు ఇళ్లు చేరుకోవాలంటే ఇబ్బందిగా ఉంటుంది. సమయానికి బస్సులు, ఇతర సౌకర్యాలు ఉండవు. –రెడ్డప్పరెడ్డి, వైఎస్సార్‌టీఎఫ్ జిల్లా అధ్యక్షులు

క్లుప్తంగా

అప్పుల బాధతో యువకుడు ఆత్మహత్య

బి.కొత్తకోట : అప్పుల బాధతో ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటనపై శుక్రవారం కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. బి.కొత్తకోటలో చిల్లర దుకాణం నడుపుకొంటూ జీవిస్తున్న చాకల సుదర్శన్ (26) పెళ్లయి, పిల్లలున్న వితంతవు శ్రావణిని వివాహం చేసుకున్నాడు. కుటుంబం గడిచేందుకు, వ్యాపారానికి అప్పులు చేయడంతో తీర్చే మార్గం తెలియక బాధపడేవాడు. గత ఆదివారం తిరుపతిలో పని చేసుకుని వస్తానని ఇంట్లో చెప్పాడు. అయితే అప్పటికే ఆత్మహత్య చేసుకునేందుకు ఎలుకల మందు తినడంతో అపస్మారకస్థితిలో ఉండగా కుటుంబీకులు గుర్తించారు. చికిత్స కోసం తిరుపతి రుయా తరలించగా చికిత్స పొందుతూ గురువారం సాయంత్రం మృతి చెందాడు. దీనిపై మృతుని తల్లి లక్ష్మీ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

వివాహిత ఆత్మహత్యాయత్నం

మదనపల్లె : కుటుంబ సమస్యలతో మనస్తాపం చెంది వివాహిత ఆత్మహత్యకు ప్రయత్నించిన ఘటన శుక్రవారం పీటీఎం మండలంలో జరిగింది. పులికల్లు గ్రామానికి చెందిన శ్రీకాంత్ భార్య శిల్ప(28) కుటుంబసమస్యలతో భర్తతో గొడవపడింది. మనస్తాపం చెంది ఇంటివద్దే పురుగుమందు తాగి ఆత్మహత్యయత్నానికి పాల్పడింది. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే బాధితురాలిని మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. సంబంధిత పోలీసులు కేసు విచారణ చేస్తున్నారు.

బెల్ట్‌షాపు నిర్వాహకుడి అరెస్ట్

మదనపల్లె : బెల్ట్‌షాపు నిర్వహిస్తున్న వ్యక్తిని అరెస్ట్‌చేసి కేసు నమోదు చేసినట్లు తాలూకా సీఐ కళావెంకటరమణ తెలిపారు. మండలంలోని చీకలబైలు గ్రామంలో బెల్ట్‌షాపు నిర్వహిస్తున్నట్లు సమాచారం అందడంతో ఎస్‌ఐ చంద్రమోహన్ సిబ్బందితో కలిసి శుక్రవారం దాడి చేశామన్నారు. దాడిలో బెల్ట్‌షాపు నిర్వహిస్తున్న సుబ్బన్న కుమారుడు జి.చంద్రశేఖర్(43)ను అదుపులోకి తీసుకుని అతడి వద్ద నుంచి రూ.2,720 విలువ చేసే 26 క్వార్టర్ బాటిళ్ల ఆంధ్ర మద్యంను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

అదృశ్యమైన బాలుడు సురక్షితం



బాలున్ని తహసీల్దార్ ముందు హాజరు పరచిన పోలీసులు

పీలేరు రూరల్ : అదృశ్యమైన బాలున్ని పోలీసులు సురక్షితంగా తీసుకొచ్చి తల్లిదండ్రులకు అప్పగించారు. స్థానిక నాగిరెడ్డి కాలనీకి చెందిన నాగసందీప్ (13) స్థానిక వీఎస్ఎన్ సిద్ధార్థ స్కూల్లో 8వ తరగతి చదువుతున్నాడు. గురువారం ఇంటి నుంచి వెళ్లిపోయి కనపడలేదు. తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. అయితే తిరుపతి బస్టాండ్‌లో గుర్తించి సురక్షితంగా తీసుకొచ్చారు. శుక్రవారం స్థానిక తహసీల్దార్ భీమేశ్వర్‌రావు ఎదుట బైండోవర్ చేసి తల్లిదండ్రులకు అప్పగించారు.

భర్తే కాలయముడు

- మద్యానికి డబ్బులు ఇవ్వలేదని సుత్తితో భార్యతలపై బాదిన భర్త
- ఇంటిలోనే రక్తపు మడుగులో కుప్పకూలిన భార్య
- ముగ్గురు చిన్నారుల భవితవ్యం ఏమిటో?



రక్తపు మడుగులో జమీల మృతదేహం (ఇన్‌సెట్) హత్యకు గురైన జమీల (ఫైల్)



బిక్కుబిక్కుమంటున్న చిన్నారులు

కడప అర్బన్ : భర్తే కాలయముడిగా మారి భార్య తలపై సుత్తితో కొట్టి దారుణంగా హత్య చేసిన సంఘటన కడప నగరంలో సంచలనం కలిగించింది. మద్యం సేవించడానికి డబ్బులను ఇవ్వలేదనే నెపంతో జీవితాంతం తోడు నీడగా నిలిచి, పిల్లలకు మంచి తండ్రిగా చూసుకోవాల్సిన ఆ వ్యక్తి భార్యను కిరాతకంగా హత్య చేసిన సంఘటన హృదయవిదారకంగా మారింది. ఈ సంఘటన వారి ముగ్గురు పిల్లల జీవితాన్ని సుడిగుండంలోకి నెట్టేసింది. కడప నగరంలోని టూటౌన్ సీఐ బి. నాగార్జున, ఎస్ఐ ఎస్‌కెఎం హుసేన్, మృతురాలి బంధువులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. నగరంలోని బెల్లమండివీధి, చిన్నముని రావు వీధిలో గత నెల రోజులక్రిందట ఓ ఇంటిలో బాడుగకు పఠాన్ ఇమ్రాన్‌ఖాన్, అతని భార్య పఠాన్ జమీల (28) చేరారు. వీరికి ముగ్గురు సంతానం. వీరిలో షాహిదాఖానం(9), ఏజాజ్‌ఖాన్ (7), అలినాఖానం(5) ఉన్నారు. ఇమ్రాన్‌ఖాన్ ఎలక్ట్రిషన్ పనిచేసుకుంటూ జీవనం సాగించేవాడు. భార్యతో తరచూ గొడవపడుతూ తాను మద్యం సేవించి వచ్చి మరింత తీవ్రస్థాయిలో భార్యను వేధించేవాడు. ఈ క్రమంలోనే గురువారం సాయంత్రం వరకు పని చేసుకుని వచ్చిన ఇమ్రాన్‌ఖాన్ తన భార్యకు రూ. 1000 డబ్బులు ఇచ్చాడు. ఆ డబ్బులో రూ. 500 దాచిపెట్టి, రూ.300 తన భర్తకు మద్యం సేవించేందుకు ఇచ్చింది. రూ. 200 కూరగాయలను తీసుకుని వచ్చింది. రాత్రి 9 గంటల సమయంలో తనకు మద్యం సేవించడానికి ఇంకా డబ్బులు కావాలంటూ భార్య జమీలతో భర్త వాగ్వాదానికి దిగాడు. ఈ నేపథ్యంలో భార్య జమీల ఈనెల అద్దె డబ్బులను కట్టాలని, అదే కట్టకుండా డబ్బులను మద్యానికి ఇవ్వమని అంటున్నావా? అనీ అరిచింది. తీవ్ర ఆగ్రహానికి గురైన భర్త తాను ఉపయోగించే ఎలక్ట్రిషన్ కిట్‌లో ఉన్న సుత్తిని తీసుకుని ఆవేశంతో ఊగిపోతూ భార్య తలపై మూడు సార్లు దాడి చేశాడు. ఈ దెబ్బలకు రక్తపుమడుగులో అక్కడికక్కడే జమీల కుప్పకూలిపోయింది. తన తండ్రి తల్లిని సుత్తితో బాదిన విషయాన్ని గమనించిన పెద్దకుమార్తె షాహిదాఖానమ్ భయంతో తన బంధువుల ఇంటికి పరుగుతీసింది. వారికి చెప్పగానే జమీల బావ, అన్నదమ్ములు పరుగెత్తుకుంటూ వచ్చారు. పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఎట్టకేలకు స్థానిక ప్రజల సాయంతో జమీలను ఆటోలో రిమ్స్‌కు తరలించారు. రిమ్స్ డాక్టర్లు ఆమె మృతి చెందిందని నిర్ధారించారు. సంఘటన స్థలాన్ని పోలీసులు పరిశీలించారు. చుట్టుపక్కలా విచారించారు. తమ తల్లి దారుణంగా హత్యకు గురి కావడం, తన తండ్రే హత్య చేయడంతో ముగ్గురు పిల్లలు అనాథలుగా మారారు. వారి భవిష్యత్తు ఎలా వుంటుందోననీ స్థానికులు అనుకుంటున్నారు. ఏది ఏమైనా ఈ సంఘటనతో ఐదుగురు జీవితాలను ఛిన్నాభిన్నం చేసింది.

రోడ్డు భద్రతా నియమాలు పాటించాలి



మాట్లాడుతున్న కడప ఈడీ చంద్రశేఖర్

రాయచోటి అర్బన్ : రోడ్డుభద్రతా నియమాలను పాటించాలని, తద్వారా సురక్షితమైన ప్రయాణానికి కేరాఫ్ అడ్రస్ ఆర్టీసీ అన్న నమ్మకాన్ని నిలుపుకుందామని కడప జోన్-4 ఈడీ చంద్రశేఖర్ పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక ఆర్టీసీ డిపో ఆవరణలో రోడ్డు భద్రతామాసోత్సవాలను నిర్వహించారు. ముఖ్యఅతిధిగా హాజరైన ఆయన మాట్లాడుతూ పలురకాల కారణాలతో దేశవ్యాప్తంగా రోడ్డుప్రమాద మృతుల సంఖ్య రోజురోజుకు పెరుగుతోందన్నారు. 2022 - 23లో 1.67 లక్షల మంది, 2023 - 24లో 1.72 లక్షల మంది రోడ్డు ప్రమాదాల్లో మరణించారన్నారు. సమస్య తీవ్రతను గుర్తించే ఆర్టీసీ యాజమాన్యం గతంలో రోడ్డు భద్రతా వారోత్సవాలు, పక్షోత్సవాలు, నేడు మాసోత్సవాలను నిర్వహిస్తూ డ్రైవర్లను, ప్రజలను చైతన్యవంతులను చేసేందుకు కృషిచేస్తున్నట్లు వివరించారు. మాసోత్స వాలలో భాగంగా రక్తదాన శిబిరాలను సైతం నిర్వహించి రక్తం సేకరిస్తున్నట్లు తెలిపారు. ప్రజారవాణాలో డ్రైవర్లదే కీలకపాత్ర అని అన్నారు. రాయచోటి ఎంవీఐ సుబ్బరాయుడు, డీపీటీఓ చెంగల్‌రెడ్డి, ట్రాఫిక్ సీఐ విశ్వనాథరెడ్డి మాట్లాడుతూ ఆర్టీసీ డ్రైవర్లు ప్రశాంతమైన మనస్సు, ఏకాగ్రతతో వాహనాలను నడపాలని, ప్రయాణికుల ప్రాణాలను రక్షించాలని కోరారు. అనంతరం గత 32 సంవత్స రాలుగా ఎలాంటి ప్రమాదాలకు తావివ్వకుండా బస్సులను నడుపుతున్న ఆర్టీసీ డ్రైవర్లు ఎస్.ఎ.పీర్, వి.ఎస్.వాసులు, జి. చంద్రలను అధికారులు సన్మానించి ప్రశంసాపత్రం, నగదు అవార్డులను అందచేశారు. కార్యక్రమంలో ఆర్టీసీ డీఎం రాజశేఖర్ తదిరుతులు పాల్గొన్నారు.

ఆదర్శప్రాయులు దామోదరం సంజీవయ్య



దామోదరం సంజీవయ్య చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న అధికారులు

రాయచోటి : అత్యున్నత వ్యక్తిత్వం, ఉన్నత విలువలకు మారుపేరైన దామోదరం సంజీవయ్య అందరికీ ఆదర్శప్రాయులని డీఆర్‌ఓ మధుసూదన్ రావు పేర్కొన్నారు.. శుక్రవారం ఉదయం రాయచోటి కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాల్‌లో దామోదరం సంజీవయ్య జయంతిని నిర్వహించారు ఆయన అట్టడుగు స్థాయి నుంచి దేశంలోనే మొదటి దళిత ముఖ్యమంత్రి, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి రెండో ముఖ్యమంత్రిగా.. కేంద్రప్రభుత్వంలో మంత్రిగా పదవులను అధిరోహించి తన జీవితాన్ని సమాజంకోసం త్యాగం చేశారని డీఆర్‌ఓ కొనియాడారు. పాఠశాల విద్యార్థులందరూ దామోదరం సంజీవయ్య జీవితం నుంచి స్ఫూర్తి పొంది సమాజానికి ఉపయోగపడేలా పనులు చేయాలని సూచించారు.జిల్లా సాంఘిక సంక్షేమశాఖ అధికారి జయప్రకాష్, జిల్లా వెనుకబడిన తరగతులశాఖ అధికారి సురేష్, జిల్లా జిఐఎస్‌డబ్ల్యూఎస్ అధికారి లక్ష్మీపతి, జిల్లా విజిలెన్స్, పర్యవేక్షణ కమిటీ సభ్యులు సంజీవయ్య సేవలను కొనియాడారు. సమావేశంలో డీవీఎంసీ కమిటీ సభ్యులు శ్రీనివాసులు, రామకృష్ణ, వెంకటరమణ, మనోహర్, రాజశేఖర్, బోదేశావలి తదితరులు పాల్గొన్నారు.

కువైట్‌లో మండల వాసి మృతి



కొప్పల రవికుమార్ (ఫైల్)

ఓబులవారిపల్లె : కువైట్ గల్ఫ్ దేశంలో జీవనోపాధి కోసం వెళ్లిన కొప్పల రవికుమార్ (31) రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. చిన్నఓరంపాడు కమ్మపల్లె దళితవాడ గ్రామానికి చెందిన కొప్పల రవికుమార్ డ్రైవర్గా పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. గత నాలుగు నెలల క్రితం జీవనోపాధి కోసం కువైట్‌కు వెళ్లాడు. అక్కడ రోడ్డు ప్రమాదంలో మృతి చెందినట్లు బంధువులు తెలిపారు. మృతుడికి భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఫిబ్రవరి 12వ తేదీ మృతిచెందాడని, 15వ తేదీన శనివారం స్వగ్రామానికి మృతదేహం చేరుతుందని తెలిపారు.

అధికారిని దూషించిన జనసేన నాయకుడిపై కేసు

ఒంటిమిట్ట : కడప డిప్యూటీ సర్వేయర్ గంధం ప్రియాంకను దూషించిన కారణంగా జనసేన నాకుడు హరివెంకట రమణ అలియాస్ హరిరాయల్ అనే వ్యక్తిపై శుక్రవారం ఒంటిమిట్ట పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్ఐ శివప్రసాద్ తెలిపిన వివరాల మేరకు.. ఈనెల 8వ తేదీన మంటపంపల్లి విలేజ్ సర్వేయర్ మహబూబ్‌బాషా దురుసు ప్రవర్తన గల వ్యక్తి అని కడప కలెక్టరేట్‌లో చింతరాజుపల్లి పంచాయతీకి చెందిన జనసేన నాయకుడు హరి వెంకటరమణ ఫిర్యాదు చేశాడు. దానిపై ఈనెల 10వ తేదీన కడప డిప్యూటీ సర్వేయర్ గంధం ప్రియాంక హరి వెంకటరమణకు ఫోన్ చేశారు. మీ సమస్య ఏమిటని అడిగిన ఆమెను సరిన్న సమాధానం ఇవ్వకుండా మాటమాట పెరిగేదాక తీసుకువచ్చాడు. మాట మాట పెరగడంతో నోటికి వచ్చినట్లు అసభ్య పదజాలంతో హరి వెంకటరమణ డిప్యూటీ సర్వేయర్‌ను దూషించి, నేను రాష్ట్ర జనసేన నాయకుడిని అని బెదిరించాడు. ఈ ఘటనపై ఒంటిమిట్ట పోలీసులకు డిప్యూటీ సర్వేయర్ ప్రియాంక ఫిర్యాదు చేసింది. ఎస్ఐ శివప్రసాద్ కేసు నమోదు చేశారు.

ఇసుక దోపిడీకి హద్దులు ఉన్నాయ్

- హద్దులు దాటితే ఊరుకోం
- ఇసుక రవాణాను అడ్డుకుంటున్న ట్రాక్టర్ యజమానులు
- పోలీసుల జోక్యంతో సద్దుమణిగిన వివాదం



ఇసుక ట్రాక్టర్ల యజమానులు ఘర్షణ పడుతున్న దృశ్యం

రాయచోటి : దొంగలు దొంగలు ఊర్లు పంచుకున్నట్లు ఇసుక, మట్టి వ్యాపారులు ప్రాంతాలను సరిహద్దులుగా మార్చుకుని దోపిడీ వ్యాపారాన్ని కొనసాగిస్తున్నారు. సమీప ప్రాంతాలలో ఉన్న వాగులు, వంకలు, నదులు, చెరువుల్లో ఉన్న ఇసుక మట్టిని ట్రాక్టర్లు, టిప్పర్ల సాయంతో కొల్లగొడుతూ రోజుకు లక్ష రూపాయలు వంతున ఆదాయాలు గడిస్తున్నారు. కళ్ల ముందు ఇష్టం వచ్చిన రీతిలో దోపిడీ పర్వం సాగుతున్నా నిలువరించాల్సిన అధికారులు మిన్నకుండిపోయారన్న విమర్శలు ఉన్నాయి. రాయచోటి పట్టణ పరిధిలోని ఇతర ప్రాంతాలకు చెందిన ట్రాక్టర్ల యజమానులు ఇసుక, మట్టిని తరలిస్తుండటాన్ని స్థానికంగా ఉన్న వ్యాపారులు అడ్డుకుంటున్నారు. శుక్రవారం ఉదయం రాయచోటి రూరల్ మండల పరిధిలో ఉన్న దిగువ అబ్బవరం గ్రామం వద్ద వీరబల్లి ప్రాంతం నుంచి వస్తున్న ఇసుక ట్రాక్టర్లను ఎపట్టణంలోని రానివ్వకుండా అడ్డుకున్నారు. అంతేకాకుండా రాయచోటి ప్రాంతానికి చెందిన ట్రాక్టర్లను వీరబల్లి, సుండుపల్లి, చిన్నమండెం, రామాపురం మండలాలకు చెందిన ఇసుక వ్యాపారులు పట్టణానికి చెందిన ఇసుక వ్యాపారులను రానివ్వకుండా నిలువరిస్తున్నట్లు సమాచారం. ఏ ప్రాంతంలో ఉన్నవారు ఆ ప్రాంతంలో ఉన్న ఇసుక, మట్టిని వారికి ఇష్టం వచ్చిన రీతిలో విక్రయించుకోవచ్చు అన్న ఒప్పందాలు చేసుకున్నట్లు తెలుస్తుంది. వీరబల్లి వైపు నుంచి వస్తున్న ట్రాక్టర్లను శుక్రవారం పట్టణానికి చెందిన ఇసుక వ్యాపారులంతా కలిసి రానివ్వకుండా అడ్డుకున్నారు. ఈ విషయంపై ఇరువర్గాల మధ్య తీవ్ర ఘర్షణ తలెత్తింది. దాడులు ప్రతి దాడులు వరకు దారి తీసింది. దాడుల సమాచారాన్ని అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని ఇరువర్గాలను శాంతిపచేసి సమస్యను సావధానంగా పరిష్కరించినట్లు తెలిసింది.

పంట పొలాలపై ఏనుగుల దాడి



ఏనుగుల ధ్వంసం చేసిన కంచె

పుల్లంపేట : అడవి ఏనుగుల దాడి చేయడంతో అరటి పంట ధ్వంసమైంది. మండల పరిధిలోని అనంతసముద్రం పంచాయతీలోని దాసరిపల్లి గ్రామ సమీపాన ఉన్న కసిరెడ్డి సుబ్రమణ్యంరెడ్డికి చెందిన అరటి పొలంలోకి గురువారం రాత్రి అడవి ఏనుగుల గుంపు చొరబడ్డాయి. ముందుగా పొలానికి కంచేగా వేసిన ఫెన్సింగ్ పోల్‌లను, మెస్‌లను ధ్వంసం చేసి పొలంలోకి చొచ్చుకువచ్చాయి. అనంతరం వందలాది అరటి చెట్లను ఏనుగులు కాళ్లతో తొక్కి అరటి గెలలను నేలకు తోశాయి. ఏనుగులు దాడిలో దాదాపు లక్ష రూపాయలకు పైగా నష్ట పోయినట్లు రైతు తెలిపాడు. అధికారులు, ప్రభుత్వం తమ పంట నష్టానికి పరిహారం చెల్లించి ఆదుకోవాలని కోరారు. అడవి ఏనుగులు పొలాల మీదికి రాకుండా అధికారులు గట్టి చర్యలు చేపట్టాలని కోరారు.

అగ్ని ప్రమాదంలో రూ.3 లక్షలు నష్టం

- బూడిదైన వ్యవసాయ పరికరాలు
- మహిళకు స్వల్ప గాయాలు



కాలిపోతున్న గడ్డివామి, చెట్లు

బి.కొత్తకోట : వ్యవసాయ పొలం వద్ద గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టడంతో రూ.2 లక్షల నష్టం వాటిల్లిన ఘటన శుక్రవారం మధ్యాహ్నం బి.కొత్తకోట మండలంలోని టేకులపెంటలో జరిగింది. బాధితుల కథనం మేరకు వివరాలు ఇలా.. గట్టు గ్రామం చలిమామిడికి చెందిన రైతు కే.సూర్యనారాయణ భార్య సరస్వతమ్మతో కలిసి నాయనబావి పంచాయతీ టేకులపెంట సమీపంలో వ్యవసాయం చేసుకోంటూ జీవిస్తున్నాడు. మధ్యాహ్నం పొలంలో ఒక్కసారిగా మంటలు వ్యాపించడంతో సేద్యానికి వినియోగించే డ్రిప్ పరికరాలు, వ్యవసాయ పనిముట్లు, పీవీసీ పైపులు, పొలంలోని చెట్లు కాలిపోయాయి. పశువుల కోసం నిల్వ ఉంచిన గడ్డివాములు కాలిపోయాయి. మంటలకు కొబ్బరి కాయలు కూడా మాడిపోయాయి. కాపురం ఉండే ఇంటిపైకప్పు, గోడలకు మంటలు వ్యాపించాయి. టమాట పంట కోసం సిద్ధంగా ఉంచిన రూ.లక్ష విలువైన కట్టెలు కాలిపోగా ఇంటి సామాగ్రి కూడా కాలిబూడిదైంది. ఆ సమయంలో అక్కడే ఉన్న ఆర్పేందుకు ప్రయత్నించిన సరస్వతమ్మ స్వల్పంగా గాయపడింది. ఈ ఘటనతో తీవ్రంగా నష్టపోయానని ప్రభుత్వం ఆదుకోవాలని బాధిత రైతు సూర్యనారాయణ కోరుతున్నాడు.

రైతుల సమక్షంలోనే రీ సర్వే చేయండి

జాయింట్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్



కలకడ మండలంలో రీ సర్వే పనులను తనిఖీ చేస్తున్న జేసీ ఆదర్శ రాజేంద్రన్

కలకడ : జిల్లాలో చేపట్టిన భూముల రీ సర్వే రైతుల సమక్షంలో వారి వద్ద ఉన్న రికార్డులు, రెవెన్యూశాఖ రికార్డుల మేరకు చేపట్టాలని జాయింట్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్ ఆదేశించారు. శుక్రవారం మండలంలోని గుడిబండ పంచాయతీ చొక్కన్నగారిపల్లెలో నిర్వహిస్తున్న భూ రీసర్వేను తనిఖీ చేశారు. అక్కడి రైతులతో మాట్లాడుతూ పంటల దిగుబడి వివరాలు, భూముల సారవంతంపై రైతులను అడిగి తెలుసుకున్నారు. పంట మార్పిడి, పెట్టుబడులు గురించి ఆరాతీశారు. జిల్లాలో నిర్వహించిన రెవెన్యూ గ్రామసభలలో వచ్చిన ఫిర్యాదులు, దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి వెంటనే పరిష్కరించడానికి సిబ్బంది చొరవచూపాలని తహసీల్దార్ పనికుమార్‌ను ఆదేశించారు. కోర్టు పరిధిలోని కేసులు తప్ప వందశాతం పూర్తి చేయడానికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో మండల సర్వేయర్ దేవి, వీఆర్‌ఓలు, సచివాలయ సర్వేయర్‌లు చైతన్య కుమార్‌రెడ్డి, శివ, వీఆర్ఏలు పాల్గొన్నారు.

స్కూటర్‌ను ఢీకొన్న కారు

ప్రమాదంలో ఒకరు మృతి



మృతి చెందిన పెద్దరెడ్డయ్య

రామాపురం : కర్నూలు - చిత్తూరు 40వ జాతీయ రహదారిలోని బండపల్లె బస్‌స్టాప్ వద్ద స్కూటర్ శుక్రవారం రోడ్డు దాటుతూ ఉండగా రాయచోటి వైపు నుంచి ఏపీ40ఏహెచ్0266 కారు ఢీ కొంది. ప్రమాదంలో ఒకరు మృతి చెందగా మరొకరికి కాలు విరిగిందని ఎస్ఐ వెంకట సుధాకర్‌రెడ్డి తెలిపారు. వివరాలిలా.. రామాపుర మండలం కుమ్మరపల్లెకు చెందిన డి.పెద్దరెడ్డయ్య, తన భార్యతో కలిసి బండపల్లెకి వెళ్లి తిరిగి ఇంటికి వెళ్లే మార్గంలో స్కూటర్‌పై రోడ్డు దాటుతూ ఉండగా రాయచోటి వైపు నుంచి కడప వైపు వెళ్తున్న కారు ఢీ కొంది. ప్రమాదంలో దగ్గుపాటి పెద్దరెడ్డయ్యకు తీవ్ర గాయాలు, భార్యకు కాలు విరిగింది. పోలీసులు చికిత్స నిమిత్తం 108లో రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ పెద్ద రెడ్డయ్య మృతి చెందగా, భార్యను మెరుగైన చికిత్స కోసం కడప రిమ్స్‌కు తరలించారు.

కారు ఢీకొని తమిళనాడువాసికి తీవ్రగాయాలు



గాయపడిన ఎన్.సతీష్‌కుమార్

మదనపల్లె : కారు ఢీకొని క్రేన్ ఆపరేటర్‌గా పనిచేస్తున్న తమిళనాడు వాసి తీవ్రంగా గాయపడి, ప్రమాదంలో రెండుకాళ్లు దెబ్బతిన్న ఘటన శుక్రవారం కురబలకోట మండలంలో చోటు చేసుకుంది. తమిళనాడు సేలం జిల్లా ధర్మపురికి చెందిన నాగప్ప కుమారుడు ఎన్.సతీష్‌కుమార్ (27) హైడ్రాలిక్ క్రేన్ ఆపరేటర్‌గా పనిచేస్తూ జీవిస్తున్నాడు. సత్యసాయి జిల్లా కొక్కంటిలో పనులు చేసేందుకు స్వగ్రామం నుంచి ద్విచక్రవాహనంలో బయలుదేరాడు. మార్గమధ్యంలోని కురబలకోట మండలం కంటేవారిపల్లె పంచాయతీ చెన్నామర్రిమిట్ట వద్ద ఎదురుగా వచ్చిన కారు ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డాడు. ప్రమాదంలో రెండుకాళ్లతో పాటు చెయ్యి ఫ్యాక్చర్ అయింది. గమనించిన స్థానికులు వెంటనే బాధితుడ్ని 108 వాహనంలో మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం తిరుపతికి రెఫర్‌చేశారు.

అత్తపై అల్లుడు దాడి

ప్రొద్దుటూరు క్రైం : అత్తపై దాడి చేసిన ఘటనలో అల్లుడిపై వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. వసంతపేటకు చెందిన సాహితికి సాఫ్ట్‌వేర్ ఉద్యోగి హరీష్‌తో గతేడాది మార్చి 22న వివాహం అయింది. కొన్ని రోజుల పాటు భార్యాభర్తలు అన్యోన్యంగా ఉండేవారు. తర్వాత వారి మధ్య గొడవలు మొదలయ్యాయి. అదనపు కట్నం తీసుకొని రావాలంటూ అతను భార్యను వేధించసాగాడు. ఈ క్రమంలో ఈ నెల 8న సాహితి ఆడబిడ్డకు జన్మనిచ్చింది. భార్య, కుమార్తెను చూసేందుకు హరీష్ గురువారం అత్తగారింటికి వెళ్లాడు. అక్కడ సాహితి, హరీష్‌లు గొడవ పడుతుండగా సాహితి అమ్మ వెంకటరంగమ్మ అడ్డువచ్చింది. దీంతో హరీష్ ఆమెను కొట్టడంతో తలకు గాయమైంది. సాహితి ఫిర్యాదు మేరకు శుక్రవారం సాయంత్రం కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు వన్‌టౌన్ ఎస్ఐ సంజీవరెడ్డి తెలిపారు.

గంగమ్మా.. చల్లంగా చూడమ్మా





అమ్మవారికి పూజలు చేస్తున్న అర్చకులు, అమ్మవారిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే ద్వారకనాథరెడ్డి, నిస్సార్ అహ్మద్ తదితరులు

ఘనంగా ప్రారంభమైన సీటీఎం జాతర

మదనపల్లె సిటీ : గంగమ్మా ...చల్లంగా చూడమ్మా అంటూ భక్తులు అమ్మవారిని వేడుకున్నారు. మదనపల్లె మండలం సీటీఎంలో వెలసిన శ్రీ నలవీరగంగాభవానీ జాతర ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం రాత్రి తిరునాల ఘనంగా జరిగింది. ఆలయం విద్యుత్ దీపాల వెలుగుల మధ్య వెలిగిపోయింది. ప్రత్యేక అలంకరణలు, వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు వెరసి జాతర వైభవంగా జరిగింది. ఓ వైపు అమ్మవారికి అర్చకులు పూజలు చేస్తుండగా .. మరోవైపు ఉత్సాహంతో జనం జాతరలో పాల్గొన్నారు. ఉదయం అమ్మవారికి సీటీఎం, కొత్తవారిపల్లె, దుబ్బిగానిపల్లె, సీటీఎం క్రాస్ పంచాయతీలకు చెందిన మహిళలు ఊరేగింపుగా అమ్మవారికి బోనాలు సమర్పించారు. అమ్మవారికి చీర, సారెలను అందజేశారు. ఆలయం ధ్వజస్తంభం ఎదుట మొక్కులు తీర్చుకున్నారు. అసాదివారు అమ్మవారిని కీర్తిసూ పాటలు పాడారు. అమ్మవారికి ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. తిరుపతి-మదనపల్లె జాతీయ రహదారి జనసంద్రంగా మారింది. ఆలయం ప్రాంగణంలో దుకాణాలు వెలిశాయి. చిన్నపిల్లల కోసం జెయింట్‌వీల్ , డ్రాగన్‌ట్రిన్, కొలంబస్, రంగులరాట్నం వంటి పరికరాలు ఏర్పాటు చేశారు. జాతర పురస్కరించుకుని అమ్మవారి విగ్రహాన్ని ప్రత్యేక వాహనంలో ఊరేగించారు. భక్తులు అమ్మవారికి మొక్కులు తీర్చుకున్నారు. భక్తుల కోసం ఆర్టీసీ-2 డిపో ప్రత్యేక బస్సులు నడిపారు. తాలూకా పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. జాతర ఏర్పాట్లును నిర్వాహకులు సీటీఎం సర్పంచు ఆనంద పార్థసారథి, పొగాకు వీరప్రతాప్, వెలుగు చంద్ర, సురేంద్రరెడ్డి పర్యవేక్షించారు.

ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన చాందినీబండ్లు

గంగజాతర పురస్కరించుకుని పలువురు చాందినీ బండ్లును ఏర్పాటు చేశారు. సమీప గ్రామాల నుంచి ఊరేగింపుగా ఆలయం వద్దకు చేరుకుని ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. మదనపల్లె మండలం కొండామారిపల్లె వెంకప్పకోటకు చెందిన పోతప్ప చాందీని బండి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. పలువురు అన్నదానాలు చేశారు. చాందినీబండ్లును తిలకించేందుకు ప్రజలు పెద్ద ఎత్తున వచ్చారు.

అమ్మవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే

సీటీఎం జాతరను పురస్కరించుకుని నలవీరగంగాభవానీ అమ్మవారి జాతరలో తంబళ్లపల్లె ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి, మదనపల్లె నియోజకర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త నిస్సార్ అహ్మద్ పాల్గొన్నారు. ఆలయ కమిటీ నిర్వాహకులు ఆనంద పార్థసారథి, చంద్ర, బండ్లపల్లి అక్కులప్పలు ఘనంగా స్వాగతం పలికారు. అమ్మవారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో సీటీఎం క్రాస్ పంచాయతీ ప్రత్యేక ఆహ్వానితులు బండ్లపల్లి వెంకటరమణ, మున్సిపల్ వైస్ చైర్మన్ జింకా చలపతి, నాయకులు బాబ్‌జాన్, ఎస్.ఎ.కరీముల్లా, హర్ష, తిలక్, నాగరాజు,సోమశేఖర్, ఈశ్వరనాయక్ తదితరులు పాల్గొన్నారు.

బాలికపై అత్యాచారం

ప్రొద్దుటూరు క్రైం : మైనర్ బాలికను అత్యాచారం చేసిన ఘటనలో యువకునిపై త్రీ టౌన్ పోలీసులు పోక్సో కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. ప్రొద్దుటూరుకు చెందిన నల్లబోతుల కుల్లాయప్ప అనే యువకుడు మాయమాటలు చెప్పి ఒక మైనర్ బాలికను తీసుకెళ్లాడు. అంతకు ముందు బాలిక కనిపించలేదని తల్లిదండ్రులు ఫిర్యాదు చేయడంతో త్రీ టౌన్ పోలీస్‌స్టేషన్‌లో మిస్సింగ్ కేసు నమోదు అయింది. ఈ క్రమంలో గురువారం బాలికను పోలీసులు గుర్తించి విచారణ చేపట్టారు. తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కుల్లాయప్ప అలియాస్ హర్షపై శుక్రవారం సాయంత్రం అత్యాచారం, పోక్సో యాక్ట్ కింద కేసు నమోదు చేసి రిమాండుకు తరలించినట్లు నట్లు త్రీ టౌన్ సీఐ గోవిందరెడ్డి తెలిపారు.

సాక్షి క్లాసిఫైడ్స్

SERIVCES

CHANGE OF NAME

■ SYED MAHAMMED అను నా పేరును SYED MAHAMEED గా మార్చుకోబడినది. SYED MAHAMEED S/O SYED SHAHUL HAMEED, R/O D.NO: 21/635, BONDILI STREET, NEAR HANUMAN TEMPLE, JENDA STREET, NELLORE DISTRICT, A.P.

■ I, Kallu Prasad S/o Kallu Ramanaiah R/o 13/108 Naguru Vandla Palli, Padamatikona, Chinnamandem, Pedamatikona, Cuddapah, Andhra Pradesh-516214, Have Changed My Minor Son's Name (Aged 6 Years) From Kallu Prasad To Kallu Nithesh For All Future Purposes.

■ I, Goli Kalyan Kumar S/o Goli Nagendrarao Residing At Gayatri Vihar 8-89, Villa-77 Proddutur Proddutur Krishna Andhra Pradesh-521151, Have Changed My Name To Goli Akash Kalyan For All Future Purposes

ASTROLOGY

■ ఫ్రీ జ్యోతిష్యం 2 రోజుల్లో శాశ్వత పరిహారం ఫ్రీ. పురుషులకు ఎటువంటి సమస్యలు ఉన్న 100% పరిష్కారం 8688722929

WANTED

■ GRID PLUS SOLAR ENERGY WANTED:Techenicians-03, Help ers-03, (ITI/10th)- Electrician/ Solar Techenician. Cell : 9440607631,7780177934

■ హోండాకార్స్ & ఏథర్ బైక్స్ షో రూంల కోసం కడప, రాజంపేట, రాయచోటి, ప్రొద్దుటూరు నందు పనిచేయుటకు సేల్స్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను. 7093909125

■ Universal కంపెనీకి వర్క్ చేయుటకు స్త్రీ/పు కావలెను. జీతం : 25,000 నుండి 30,000 వరకు సంపాదించుకోండి. అడ్రస్ వాట్సాప్ చేయండి. సెల్ : 95027 12418.

■ కస్టమర్స్ కాడు VIP ఇంట్లో పెద్దవాళ్లని చూసుకోవడానికి స్త్రీలు/పురుషులు, ఆయా, నర్సులు, వంటవారు, RMP & డాక్టర్స్ కావలెను. జీ. 15 వేలు - 40వేలు,ఫ్రీ రూం+భోజనం. HYD. 8919613984

■ ఒమేగా హోంకేర్ నందు వృద్ధులను, పేషెంట్లను, పిల్లలను చూసుకొనుటకు వర్కర్స్ / నర్సులు కావలెను. ఫ్రీ వసతి భోజనం. జీ : 20K. Ph: 8977639662, 8977639663

■ బెంగుళూరు నందు ఓల్డ్ ఏజ్ హోమ్ కొరకు ఆయా, వార్డ్ బాయ్ మరియు వంట మనిషి కావలెను. ఫుడ్ మరియు వసతి ఫ్రీ. Ph: 9538359402

■ సెక్యూరిటీ గార్డ్స్, మాజీ సైనికులుగా 5th, 10th, డిగ్రీ, డిప్లొమా, ITI (స్త్రీ/పు)లు కావలెను. అర్హతను బట్టి జీతం. సంప్ర: 9963704460, 8341389975, 9052124024.

గమనిక

సాక్షి క్లాసిఫైడ్స్ కొరకు సంప్రదించండి
9705907418
9705944423
9010223797
9010072409